సాక్షి

చిత్తూరు

బుధవారం, 14, మే, 2025



చెరువుల సంరక్షణకు ప్రాధాన్యం

చెరువుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్, ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. - 8లో



‘స్థాయి’తగ్గించేశారా?

జెడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు చప్పగా సాగుతున్నాయి. పలువురు నేతలు, అధికారులు డుమ్మా కొడుతున్నారు. - 8లో



పంచ్ పడితే పతకమే!

కుప్పం మండలం, పైపాళ్యంకు చెందిన అన్వేష్ బాక్సింగ్‌లో విశేషంగా రాణిస్తున్నాడు. బరిలోకి దిగితే పతకమే లక్ష్యంగా దూసుకుపోతున్నాడు. - 8లో

న్యూస్‌రీల్

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ



పెనుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈఓ

చిత్తూరు కలెక్టరేట్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా సాగుతున్నట్టు డీఐఈఓ డా.ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. రెండో రోజు మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉదయం మొదటి సంవత్సరం జనరల్‌లో 5,584 మందికిగాను 5,369 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు. 215 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్‌లో 540 మందికి 494 మంది హాజరు కాగా 46 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షలో 555 మందికి 511 మంది హాజరుకాగా 44 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. ఒకేషనల్‌లో 139 మందికి 125 మంది హాజరుకాగా 14 మంది గైర్హాజరయ్యారన్నారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. జిల్లాలోని కార్వేటినగరం, చవటగుంట, పెనుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల కేంద్రాలను తాను, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దయానందరాజు, బాలసుబ్రహ్మణ్యం, శరత్‌చంద్రశేఖర్ 10 కేంద్రాలను, ఫ్లెయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ 9 కేంద్రాలను తనిఖీ చేసినట్టు డీఐఈఓ వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని యువత సివిల్ డిఫెన్స్ వలంటీర్లుగా విధులు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న వారు మై భారత్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి బీ.ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖలోని మై భారత్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా యువత దేశానికి ఉపయోగపడే విధంగా, అత్యవసర పరిస్థితుల్లో, సంక్షోభ సమయాల్లో కీలకపాత్ర పోషించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న భద్రతా సమస్యల దృష్ట్యా బలమైన సహజ ఆధారిత ప్రతిస్పందన యంత్రాగాన్ని తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత భాగస్వామ్యంతో రెస్క్యూ తరలింపు, ప్రథమ చికిత్స, అత్యవసర సంరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, పునరావాస ప్రయత్నాల్లో సహాయం చేయడం వంటి సేవల్లో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తారన్నారు. ఇప్పటికే మై భారత్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయిన మై భారత్ వలంటీర్లు, దేశానికి సేవ చేయాలనుకునే ఆసక్తి ఉన్న యువత www.mybharay.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కేంద్రంలోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

రిజిస్ట్రేషన్లు డల్



ఖాళీగా ఉన్న చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: జాతరను పురస్కరించుకొని నగరంలో రిజిస్ట్రేషన్లు మందగించాయి. పండుగ, మంగళవారం కావడంతో ఎక్కువగా లావాదేవీలు జరగలేదు. కార్యాలయాలు బోసిపోయాయి. చిత్తూరు అర్బన్, రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రోజూ దాదాపు 50కి తక్కువ కాకుండా డ్యాకుమెంటేషన్లు జరిగేవి. కానీ పండుగ రోజు కావడంతో పెద్దగా రిజిస్ట్రేషన్లు చేయడానికి ఆసక్తి చూపలేదు. చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 7 రిజిస్ట్రేషన్లు జరగగా రూ.36,000 ఆదాయం వచ్చింది. చిత్తూరు రూరల్ కార్యాలయంలో 9 డ్యాకుమెంట్లుకుగాను రూ.75 వేలు వచ్చింది.

పలువురిపై సస్పెన్షన్ వేటు

కుప్పం: క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొన్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులపై సస్పెన్షన్ వేటు వేసినట్టు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసినందుకు 1వ వార్డు కౌన్సిలర్ జగదీష్, 3వ వార్డు కౌన్సిలర్ అరవింద్, 4వ వార్డు కౌన్సిలర్ రాజమ్మ, 8వ వార్డు కౌన్సిలర్ చంద్రమ్మ, 13వ వార్డు కౌన్సిలర్ హంస, 14 వార్డు కౌన్సిలర్ మునుస్వామి, 15వ వార్డు కౌన్సిలర్ తిలవతి, 17వ వార్డు కౌన్సిలర్ దేవకి, 21 వార్డు కౌన్సిలర్ లావణ్య, 24 వార్డు కౌన్సిలర్ సయ్యద్‌అలీలను వైఎస్సార్‌సీపీ నుంచి బహిష్కరించినట్టు పేర్కొన్నారు. వీరితో పాటు శాంతిపురం జెడ్పీటీసీ శ్రీనివాసులు, వసనాడు మాజీ సర్పంచ్ మురళి, మొరసనపల్లె గ్రామానికి చెందిన నీలా జగదీష్, రామకుప్పానికి చెందిన ఆరేల్ల జయప్ప, చీలేపల్లి రవి, ఎస్.కె.సర్దార్ బాషాతో పాటు పలువురిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

ఊరంతా జాతర

చిత్తూరు నడివీధి గంగమ్మ జాతరకు జనం పోటెత్తారు. గంగమ్మా.. మమ్మేలు మాయమ్మా..! అంటూ ప్రణమిల్లారు. కర్పూర హారతులు పట్టి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు అంబళ్లు పోసి అమ్మవారిని వశం చేసుకున్నారు. కాగా బుధవారం జరిగే నిమజ్జనానికి అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

- అంగరంగ వైభవంగా చిత్తూరు నడివీధి గంగమ్మ జాతర
- తరలివచ్చిన భక్తజనం



నడివీధి గంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో చిత్తూరు నడివీధి గంగమ్మ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు గంగజాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. గంగోరి తల్లి పలు ప్రాంతాల్లో సింహ వాహనంపై ఆశీనులై భక్తులను కనువిందు చేశారు. భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. వినూత్న వేషధారణతో మొక్కులు తీర్చుకున్నారు. నడివీధిలో కొలువుదీరిన గంగమ్మతల్లికి తొలుత వంశపార్యపర్య ధర్మకర్తలు విశేష పూజలు చేసి జాతరను ప్రారంభించారు. గంగమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారికి నైవేద్యంగా అంబిలి, పిండి వంటలను సమర్పించారు. గిరింపేట, సంతపేట, దొడ్డిపల్లి, కొంగారెడ్డిపల్లి, కట్టమంచి తదితర ప్రాంతాల్లో జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాగా చిత్తూరులో రెండో రోజు ఏటా అమ్మవారిని నిమజ్జనం చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో బుధవారం 4 గంటల సమయంలో నడివీధి గంగమ్మ నిమజ్జనానికి బయలుదేరనున్నారు. వంశపారంపర్య ధర్మకర్తలు అమ్మవారికి సారె సమర్పించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

గంగమ్మ సేవలో మంత్రి

చిత్తూరు నడి వీధిగంగమ్మను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దర్శించుకున్నారు. సారె సమర్పించి అమ్మవారి హారతి అందుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, చుడా చైర్మన్ కఠారి హేమలత, నాయకులు పాల్గొన్నారు.

నేడు నిమజ్జనం.. ట్రాఫిక్ మళ్లింపు

చిత్తూరులో బుధవారం జరిగే గంగమ్మ నిమజ్జనానికి పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. మధ్యాహ్నం 2 నుంచి ట్రాఫిక్ మళ్లింపు ప్రక్రియను చేపట్టనుంది. భారీ వాహనాలను రెడ్డిగుంట జంక్షన్ మీదుగా ఇరువారం, కాణిపాకం జంక్షన్, మురకంబట్టు జంక్షన్, సాంబయ్యకండ్రిగ మీదుగా మళ్లించనున్నారు. వేలూరు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను రెడ్డిగుంట జంక్షన్ నుంచి కాణిపాకం మీదుగా మురకంబట్టు జంక్షన్, ఎల్‌జీబీ టవర్ మీదుగా ఆర్టీసీ బస్టాండుకు మళ్లించనున్నారు. ఇదే మాదిరిగానే పలమనేరు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను కాణిపాకం క్రాస్ నుంచి ఆర్టీసీ బస్టాండుకు చేరుకునేలా చర్యలు చేపట్టారు. పలమనేరు నుంచి వచ్చే ప్రైవేటు వాహనాలను ఇరువారం జంక్షన్ వరకు పరిమితం చేయనున్నారు. వేలూరు నుంచి వచ్చే ప్రైవేటు బస్సులు రెడ్డిగుంట జంక్షన్‌లో నిలుపుదల చేయనున్నారు. తిరుపతి -వేలూరు, బెంగళూరు వైపు నుంచి వచ్చే ప్రైవేటు బస్సులన్నీ మురకంబట్టు బైపాస్ నుంచి మళ్లించి ఇరువారం జంక్షన్ మీదుగా వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. అలాగే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లే వారు దర్గా సర్కిల్ మీదుగా చేరుకోవచ్చని పోలీసులు పేర్కొన్నారు.





అంబలి పోస్తున్న భక్తులు

గంగమ్మకు సారె సమర్పణ

చిత్తూరు నగరంలోని కట్టమంచి, సంతపేట, శంకరయ్యగుంట, అగ్రహారం ప్రాంతాల్లో కొలువుదీరిన గంగమ్మకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి సతీమణి ఇందుమతి సారె సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర నిర్వాహకులు ఆమెకు ఘన స్వాగతం పలికి అమ్మవారి ప్రసాదం తదితరాలను అందజేశారు. కార్పొరేటర్ హరిణిరెడ్డి, నాయకులు అగ్రహారం సత్య, సంతపేట నారాయణ, మనోహర్‌రెడ్డి మనోజ్‌రెడ్డి, అంజలిరెడ్డి, అన్బు పాల్గొన్నారు.



విజయానందరెడ్డి సతీమణి ఇందుమతికి ప్రసాదం అందజేస్తున్న కార్పొరేటర్ హరిణిరెడ్డి

గంగమ్మ సేవలో ఎస్పీ దంపతులు

చిత్తూరు నగరంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిని అమ్మవారిని ఎస్పీ మణికంఠ చందోలు దంపతులు దర్శించుకున్నారు. వారికి జాతర నిర్వాహకులు కర్పూర హారతులు పట్టి సత్కరించారు. గిరింపేటలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రముఖులకు అమ్మవారి దర్శనం కల్పించి పసుపు, కుంకుమ అందించారు. సంతపేట వంశపారంపర్య ధర్మకర్త భూపేష్‌గోపీనాథ్ దగ్గరుండి ప్రముఖులకు స్వామి దర్శనం కల్పించారు. కొంగారెడ్డిపల్లిలో శంకర్ ప్రముఖులకు అమ్మవారి మాల, నిమ్మకాయ, ప్రసాదం అందించారు.



తీర్థప్రసాదాలు అందుకుంటున్న ఎస్పీ దంపతులు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా అనీషారెడ్డి



పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకురాలు నూతన కాల్వ అనీషారెడ్డి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నియామకపు ఉత్తర్వులను విడుదల చేశారు. కాగా గత అసెంబ్లీ ఎన్నికల్లో అనీషారెడ్డి, ఆమె భర్త నూతన కాల్వ శ్రీనాథరెడ్డి పార్టీలో చేరారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేశారు. వారి సేవలను గుర్తిస్తూ మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి సూచనల మేరకు ఆమెకు పదవి వచ్చేలా చర్యలు చేపట్టారు. అనీషారెడ్డి మాట్లాడుతూ పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యోర్ల బదిలీకి కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అయ్యోర్ల బదిలీకి జిల్లా విద్యాశాఖ కసరత్తు చేపడుతోంది. ఒకే పాఠశాలలో ఐదేళ్లు పనిచేసిన హెచ్‌ఎంలు, ఎనిమిదేళ్లు నిండిన మిగిలిన కేడర్‌ల టీచర్లకు బదిలీలు తప్పనిసరిగా ఉంటాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 4,478 మంది టీచర్ల బదిలీ!

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఒకే పాఠశాలలో పనిచేస్తూ ఐదేళ్లు నిండిన హెచ్‌ఎంలు, ఎనిమిదేళ్లు నిండిన మిగిలిన కేడర్ల టీచర్లకు బదిలీలు తప్పనిసరిగా ఉండనున్నాయి. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 4,478 మందికి తప్పనిసరిగా బదిలీలు ఉండొచ్చని అధికారులు అంచనాలు వేస్తున్నారు. రెండేళ్లు నిండినవారు సైతం బదిలీలకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో దాదాపు 10 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

బడులు తెరిచే లోపు..!

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమయ్యే లోపు బదిలీలు, ఉద్యోగోన్నతులు పూర్తిచేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొదటగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ చేపట్టనున్నారు. ఈ మేరకు ఈనెల 13న రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం బదిలీలు, ఉద్యోగోన్నతులు వరుసగా చేపట్టాలని నిర్ణయించారు. జిల్లాలో మే నెలాఖరు వరకు పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయుల ఖాళీలు వెంటనే ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల నుంచి సేకరించడం మొదలు పెట్టారు. రెండు రోజుల్లో ఏకేడర్‌లో ఎన్ని ఖాళీలు, ఎక్కడెక్కడ ఉన్నాయో తేల్చేలా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.



చిత్తూరు డీఈఓ కార్యాలయం

రేషనలైజేషన్ ప్రక్రియ

117 జీవోకు ప్రత్యామ్నాయంగా జీవోను విడుదల చేశారు. ఆ జీవో ఆధారంగా టీచర్ల పోస్టులను రేషనలైజేషన్ ప్రక్రియలో దాదాపు పూర్తి చేశారు. దీంతో ఎక్కడెక్కడ ఏ పోస్టు అవసరం ఉంటుందో ఒక నిర్ధారణకొచ్చారు. రేషనలైజేషన్‌లో ఆయా చోట్ల పోస్టు కోల్పోయే టీచర్లు రేషనలైజేషన్ పాయింట్లు, పాత స్టేషన్ పాయింట్లు ఏదో ఒకదాన్ని తీసుకునే అవకాశం కల్పించనున్నారు.

- వేలం పాట జరిగి 60 రోజులైనా చెల్లించని సొమ్ము
- రూ.2కోట్లకు పైగా తమ్ముళ్ల ఎగనామం!
- పట్టనట్టు వ్యవహరిస్తున్న ఈఓ ఏకాంబరం



బోయకొండ గంగమ్మ ఆలయ ముఖచిత్రం

బోయకొండలో కూటమి అనకొండలు!

సాక్షి టాస్క్‌ఫోర్స్: పుంగనూరు నియోజకవర్గం, చౌడేపల్లె మండలంలోని బోయకొండ గంగమ్మ దేవస్థానం కూటమి నేతలకు కాసుల వర్షం కురిపిస్తోంది. నిబంధనలు తుంగలో తొక్కి అమ్మవారి సొమ్ముతోపాటు అధిక ధరలు పెంచి భక్తుల జేబులు గుల్ల చేయడం నిత్యకృత్యంగా మారుతోంది. ఇదేమిటని ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు దిగడం రివాజుగా మారుతోంది. దేవస్థానం వద్ద వివిధ హక్కులపై ఏడాది పాటు లీజుకిస్తూ నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ.4.63 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ వేలంలో హక్కులు పొందిన టీడీపీ నేతలు సుమారు రూ.2 కోట్లకు పైగా నగదు చెల్లించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయంపై సంబంధిత ఆలయ ఈఓ ఏకాంబరం పట్టీపట్టనట్టు వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది.

అసలేం జరిగిందంటే!

బోయకొండ ఆలయం వద్ద ఏడాదిపాటు వివిధ హక్కులను లీజుకిస్తూ మార్చి 10, 11 తేదీల్లో వేలం పాట నిర్వహించారు. ఇందులో కొన్ని వాయిదా పడడంతో వాటికి మార్చి 28న ఆలయ పరిపాలనా కార్యాలయంలో ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో వేలం పాటలు, సీల్డ్ టెండర్లు నిర్వహించారు. ఈ వేలం పాటలు ఏకపక్షంగా కూటమి నేతల అనుచరులే దక్కించుకున్నారు.

నిబంధనలకు పాతర

బోయకొండ ఆలయం వద్ద నిబంధనలు ఏవీ అమలు కావడంలేదు. వేలం పాటలో పాల్గొన్న వ్యక్తి హెచ్చుపాట దారుడి నుంచి మొత్తాన్ని అప్పటికప్పుడే దేవస్థానానికి జమ చేయాల్సి ఉన్నా ఈఓ ఆదిశగా చర్యలు చేపట్ట లేదు. మూడు దశలుగా జరిగిన వేలం పాటల్లో ఆలయానికి రూ.4.63 కోట్ల ఆదాయం చేకూరింది. హెచ్చుపాటదారుడి నుంచి నగదు జమ చేయకుండా లీజు హక్కు అనుభవిస్తున్నాడు. సుమారు రూ.2 కోట్లకు పైగా వేలం లీజు దారుల నుంచి నగదు రావాల్సి ఉన్నా అధికారులు ఆ విషయాన్ని గోప్యంగా ఉంచడం గమనార్హం.



బోయకొండలో వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

మొదటి పాటదారులు చెల్లించకుంటే

వేలం జరిగిన రోజు సాయంత్రం వరకు హెచ్చు పాటదారుడు నగదు చెల్లించకుంటే మొదటి పాటదారుడు నుంచి చెల్లించిన డిపాజిట్టును ఆలయ ఖాతాలో జమ చేసుకోవాలి. ఆ లీజు విషయమై వేలంలో రెండవ పాటదారుడునికి వేలం లీజు ఇవ్వాలని దేవస్థానం వారే నిబంధనలు పెట్టారు. కానీ ఇవేవీ అమలు కాకపోవడంతో ఆలయ ఆదాయానికి గండిపడుతోంది.

అందరూ కూటమి నేతలే

వేలం పాటదారులందరూ కూటమి నేతలే. బోయకొండను వారికి రిసిచ్చేసినట్టు ఉందన్న విమర్శలున్నాయి. కలెక్టర్, దేవదాయశాఖ కమిషనర్ స్పందించి ఆలయ ఆదాయానికి గండి పడకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అల్లుకుపోయిన అవినీతి అనకొండలు

బోయకొండ గంగమ్మ ఆలయంలో అవినీతి అనకొండలు అల్లుకుపోయాయి. ఓ వైపు వేలం పాటదారులు డబ్బులు చెల్లించకపోయినా ప్రశ్నించే వారే లేకుండా పోయారు. ఈఓ కూటమి నేతలకు వత్తాసు పలుకుతూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేవస్థానానికి రావాల్సిన సొమ్ము వసూలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

వేలం పాటలతో ఆలయానికి రావాల్సిన ఆదాయం ఇలా..

- కొండపై కొబ్బరికాయల విక్రయం, పూజా సామగ్రి విక్రయించుకొనే హక్కు - రూ.**52.5** లక్షలు
- పూలు, నిమ్మకాయల హారాలు, వడిబాలు, చీరలు, జాకెట్ పీసులు విక్రయించుకునే హక్కు - రూ.**42** లక్షలు
- దేవస్థానం, పంచాయతీకి చెందిన టోల్ గేటు నిర్వహించుకునే హక్కు - రూ.**68.5** లక్షలు
- పెద్దభోగం, చిన్నభోగం సేకరించి నిర్వహించుకునే హక్కు- రూ.**86.15** లక్షలు
- భక్తాదులు సమర్పించే చీరలు, రవికలు, పావడా పీసులు సేకరించుకొనే హక్కు - రూ.**46.5** లక్షలు
- కొండపైన క్యాంటీన్, ఐస్‌క్రీమ్, కూల్‌డ్రింక్స్ విక్రయించుకునే హక్కు- రూ.**20.90** లక్షలు
- కొండ కింద క్యాంటీన్, ఐస్‌క్రీమ్, కూల్‌డ్రింక్స్ విక్రయించుకునే హక్కు - రూ.**6.35** లక్షలు
- కొండపైన నాలుగు దుకాణాల్లో పవిత్ర దారాలు, టాయ్స్, ఫొటోలు, కలకండ విక్రయించుకునే హక్కు - రూ.**69** లక్షలు
- కోళ్లు విక్రయించుకునే హక్కు- రూ.**6.80** లక్షలు
- ఫొటోలు తీసుకొనే హక్కు - రూ.**1.79** లక్షలు
- కొబ్బరి పై చిప్పలు సేకరించుకునే హక్కు - రూ.**7.4** లక్షలు
- తలనీలాలు సేకరించుకొనే హక్కు - రూ.**24.6** లక్షలు
- క్లాక్ రూములు, సెల్‌ఫోన్ లగేజీ నిర్వహించుకొనే హక్కు - రూ.**18.2**
- పేపరు కవర్లు, బ్యాగులు విక్రయించుకునే హక్కు- రూ.**6.6** లక్షలు
- పాదరక్షలు భద్రపరుచుకునే హక్కు - రూ.**2.4** లక్షలు
- దేవస్థానం స్థలంలో తాత్కాలిక అంగళ్లు ఏర్పాటు, వ్యాపారం చేసుకునే హక్కు రూ.**3.26** లక్షలు

వెకేషన్ జడ్జిగా సూర్యనారాయణమూర్తి

చిత్తూరు లీగల్: జిల్లాలోని అన్ని న్యాయస్థానాలకు వెకేషన్ జడ్జిగా మదనపల్లె రెండవ అదనపు జిల్లా జడ్జి సూర్యనారాయణమూర్తి వ్యవహరించనున్నారు. న్యాయస్థానాలకు వేసవి సెలవులు కావడంతో ఉమ్మడి జిల్లాలో ఈ నెల 20, 28 తేదీ చిత్తూరు, 15, 22 తేదీల్లో తిరుపతి, 19, 27 తేదీల్లో మదనపల్లె, 14, 21, 26 తేదీల్లో పీలేరు, 16, 23 తేదీల్లో శ్రీకాళహస్తి కోర్టులకు కేసుల విచారణ నిమిత్తం సూర్యనారాయణ మూర్తి హాజరు కానున్నారు.

20న సార్వత్రిక సమ్మె

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, సీపీఐ జిల్లా కార్యదర్శులు కోదండయ్య, సురేంద్ర, నాగ రాజు పిలుపునిచ్చారు. మంగళవారం చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. లేబర్ కోడ్‌లను రద్దుచేసి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. 12వ పీఆర్సీ అమలు చేయాలని, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కరించాలన్నారు. ఆశ, అంగన్‌వాడి, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. నాయకులు షకీలా, బాలసుబ్రమణ్యం, సతీష్, జ్యోతి, అయ్యప్ప, బాలాజీరావు, చిట్టెమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగరాజు

క్లుప్తంగా

గవర్నెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేసేందుకు ఏర్పాటు చేసిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌లో పౌర సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇందుకు ప్రత్యేకంగా వాట్సాప్ నంబర్ 9552300009ను కేటాయించినట్టు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ వాట్సాప్ నెంబర్ 95523 00009 మనమిత్ర పేరుతో సేవ్ చేసుకొని ఆ నంబర్ కి హాయ్ అని సందేశం పంపి ప్రభుత్వ సేవలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. డీఎల్‌డీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రతకు కిశోర వికాసం



మాట్లాడుతున్న జిల్లా లీగల్ అడ్వైజర్ వెంకటేష్

గంగాధర నెల్లూరు : బాలికల భద్రతే కిశోర వికాసం లక్ష్యమని జిల్లా లీగల్ అడ్వైజర్ వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలోని అప్పిరెడ్డికండిగ గ్రామంలో మంగళవారం అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్ లైన్ నం.1098 తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డీసీపీఓ స్టాఫ్ షణ్ముగం, నెల్లేపల్లి మహిళా పోలీస్ మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, ప్రమీల, చిట్టెమ్మ, పావని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీలు



స్థాయి తగ్గించేశారా?

జిల్లాలో వివక్ష పాలన సాగుతోంది. పంచాయతీ, మండల స్థాయిలోని ప్రజాప్రతినిధులకు సరైన గౌరవం దక్కడం లేదు. పలువురు జెడ్పీటీసీల పట్ల వివక్ష చూపుతున్నారు. ఈ క్రమంలోనే వారు జెడ్పీ స్థాయి సంఘాల సమావేశాలపై నిరాసక్తి చూపుతున్నారు. హాజరైనా పలువురు నోరు మెదపకుండా కూర్చుంటున్నారు. ఎవరో ఒకరో ఇద్దరో మాత్రమే సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తున్నారు. దీంతో జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలను కోరం లేకపోయినప్పటికీ స్థాయి తగ్గించి నిర్వహించి మమ అనిపించేస్తున్నారు. మంగళవారం చిత్తూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్థాయి సంఘాల సమావేశాల తీరు చూసి పలువురు నోరెళ్లబెట్టడం గమనార్హం.

- జెడ్పీ స్థాయి సంఘాల సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు డుమ్మా
- క్షేత్ర స్థాయిలో ప్రొటోకాల్ పాటించడం లేదంటూ జెడ్పీటీసీల గగ్గోలు
- మధ్యలోనే వెళ్లిపోయిన జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో జెడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు మంగళవారం మమ అనిపించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన ఈ సమావేశాలు చేపట్టారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సమావేశాలు మధ్యాహ్నం 1.30 గంటలకు ముగించేశారు. 1 నుంచి 7 వరకు సంఘాల సమావేశాలను వరుసగా ఆయా సంఘాల చైర్‌పర్సన్ల అధ్యక్షతన నిర్వహించారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో వేసవి పూర్తయ్యే వరకు అధికారులు సమన్వయంతో ఉంటూ తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దని చెప్పారు. పశుసంచార వాహనాలు జిల్లాలో తిరుగుతున్నాయా అని ప్రశ్నించారు. జెడ్పీటీసీల ప్రొటోకాల్‌ను అధికారులు ఎందుకు పాటించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో జెడ్పీటీసీల ప్రొటోకాల్‌ను కచ్చితంగా పాటించాలన్నారు. సమావేశం చివర వరకు ఉండాల్సిన జెడ్పీసీఈవో రవికుమార్ నాయుడు ఉదయం 11 గంటలకే సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఆయన తీరు పట్ల జెడ్పీటీసీలు విమర్శలు గుప్పించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఈఓ జుబేదాబేగం, పలు శాఖల అధికారులు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

హాజరుకాని కూటమి ప్రజాప్రతినిధులు

జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాల్లో కూటమి ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు సభ్యులుగా ప్రతి కమిటీలో ఉన్నారు. అయితే జిల్లాలోని కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలు సమావేశానికి డుమ్మా కొట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వారు హాజరుకాకపోవడం విమర్శలకు తావిస్తోంది. అదేవిధంగా చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి హాజరుకావాల్సిన వివిధ శాఖల జిల్లా అధికారులు సైతం డుమ్మా కొట్టారు. జిల్లా అధికారుల బదులు సెకండ్ కేడర్ అధికారులు సమావేశాలకు హాజరుకావడం గమనార్హం.

సమస్యల ఏకరువు

- గత ఐదు నెలలుగా పంచాయతీరాజ్ పరిధిలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు కావడం లేదని జెడ్పీటీసీలు ఆరోపించారు.
- క్షేత్రస్థాయిలో అధికారులు జెడ్పీటీసీలకు ఏ మాత్రం విలువనివ్వడం లేదని ఆరోపించారు.
- మండలాల్లో సచివాలయం, రైతుభరోసా, ఇతర భవనాలు నిర్మించకుండా అసంపూర్తిగా నిలిపేశారన్నారు.
- పాలసముద్రం, నారాయణవనం మండలాల్లో 2018వ సంవత్సరాల్లో మంజూరు చేసిన రోడ్లను పూర్తిచేయలేదన్నారు.
- తాగునీటి సమస్య పరిష్కారానికి ఎన్ని నిధులు ఇచ్చారో కూడా జెడ్పీటీసీలకు తెలియడం లేదు.
- ఇరిగేషన్ శాఖ పరిధిలో నీరు–చెట్టు పనులు చేసి బిల్లులు అందక పూర్తిగా నష్టపోయామని, ఆ బిల్లులన్నింటికీ జీఎస్టీ చెల్లించాలని ఇబ్బందులు పెట్టడం సబబు కాదన్నారు.
- రైతులు ట్రాన్స్‌ఫార్మర్లకు దరఖాస్తు చేసుకుంటుంటే ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. జగనన్న కాలనీల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్లకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయడం లేదన్నారు. చౌడేపల్లి మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ కోసం వెళుతున్న రైతులకు నువ్వే పార్టీ అని అధికారులు అడగడం ఎంతవరకు సబబని నిలదీశారు.
- ఏర్పేడు మండలం, పరమాలపల్లి ఎస్సీ కాలనీలో కెపాసిటీ సరిపోకపోవడంతో ప్రజలు విద్యుత్ సమస్యలతో అవస్థలు పడుతున్నారన్నారు.
- పాలసముద్రం మండలంలో చాలా సంవత్సరాలుగా ఈవోపీఆర్‌డీ లేరని, ఆ మండలంలో ఇటీవల ఒక రైతు పాముకాటుకు గురై పీహెచ్‌సీకి వెళ్తే సరైన చికిత్స అందక మృతి చెందాడన్నారు.
- కాణిపాక ఆలయంలో జెడ్పీటీసీలకు ప్రొటోకాల్ లేదని చెబుతున్నారని, ప్రజాప్రతినిధులనే కనీస మర్యాద లేకుండా ఆలయ అధికారులు వ్యవహరిస్తున్నారని ఐరాల జెడ్పీటీసీ వాపోయారు.

చెరువుల సంరక్షణకు ప్రాధాన్యం

గుడిపాల: భూగర్భ జలాల పెంపు, సాగునీటి అవసరాల కోసం చెరువులను సంరక్షించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నీటి పారుదలశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం గుడిపాల మండలంలోని రామిరెడ్డిచెరువు, రెడ్డెమ్మ చెరువు, నారాయణరెడ్డి, బంగారక్క చెరువులను వారు పరిశీలించారు. ఆయకట్టుదారులు, రైతులతో మాట్లాడుతూ చెరువుల్లో పూడిక తొలగించేందుకు సత్వరం అంచనాలు రూపొందించాలని సూచించారు. ఉపాధి పథకం కింద ఒక్కో చెరువులో రూ.40 లక్షల మేర పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కారణంగా చెరువులో పేరుకుపోయిన మట్టిపై స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సత్వరం మట్టిని తొలగించాలని నేషనల్ హైవే పీడీని ఆదేశించారు. ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వరరాజు, ఈఈ మురళీమోహన్, ఎంపీడీఓ శిరీషా, తహసీల్దార్ జయంతి పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గంగవరం: కుటుంబ తగాదాలతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని కోటగురివేపల్లి గ్రామానికి చెందిన సురేష్(37) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి మూడేళ్ల క్రితం వివాహం కాగా.. కొన్నాళ్లకు ఆమె భర్తతో విభేధించి పుట్టింటికి వెళ్లిపోయింది. అదే గ్రామంలో ఉంటున్న భార్య, ఆమె కుటుంబ సభ్యులతో సురేష్ గొడవ పడ్డాడు. ఏం జరిగిందో తెలీదుగానీ మద్యం సేవించి ఇంట్లకి వెళ్లి ఉరేసుకుని తనువు చాలించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

అంగరక్షకులకు అప్రమత్తత అవసరం



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: ప్రముఖులు, ప్రజా ప్రతినిధుల వద్ద అంగరక్షకులు (గన్‌మాన్)గా విధులు నిర్వర్తిస్తున్న వారు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. గత మూడు రోజులుగా జిల్లాలోని అధికారులు, ప్రముఖులు, రాజకీయ నాయకుల వద్ద పనిచేస్తున్న అంగ రక్షకులకు ఇస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. చిత్తూరులోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ రాష్ట్ర డీఎస్పీ అంకారావుతో కలిసి ఎస్పీ ముగింపు సమావేశంలో మాట్లాడారు. అంగరక్షకులంటేనే బాధ్యతతో కూడుకున్న విధులుగా గుర్తుపెట్టుకోవాలన్నారు. ప్రతీ ఒక్క ప్రముఖుడినీ కాపాడడమే బాధ్యతగా పనిచేయాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం, సమయ పాలన, కమ్యునికేషన్స్‌పై కనీస అవగాహన ఉండాలన్నారు. సమావేశంలో ఏఆర్ ఏఎస్పీ శివానందకిషోర్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఆర్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతి గంగ జాతర

- భక్తులతో హోరెత్తిన ఆలయం
- భక్తి శ్రద్ధలతో పొంగళ్ల నివేదన
- జాతర చివరి రోజున పోటెత్తిన భక్తులు
- గంగజాతర వేషాలతో పులకించిన తిరునగరి



పోటెత్తిన భక్తులు

తిరుపతి కల్చరల్ : శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర తిరుపతిలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈనెల 6వ తేదీ రాత్రి చాటింపుతో మొదలైన గంగ జాతర వారం రోజుల పాటు అత్యంత కోలాహలంగా సాగింది. రోజువారీ విభిన్న వేషాలతో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం జాతర చివరి రోజు కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో గంగమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం అర్ధరాత్రి అమ్మవారికి మహాశాంతి అభిషేకం తర్వాత అమ్మవారి దర్శనం కోసం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మొక్కుబడిలో భాగంగా వేపాకు చీరలతో గంగమ్మను దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. జాతర చివరిరోజు కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు విశేష సంఖ్యలో భక్తులు వివిధ పౌరాణిక, జానపద, స్త్రీ వేషాలు ధరించి తిరు నగరిలోని పురవీధుల్లో సందడి చేశారు. భక్తజనంతో గంగమ్మ ఆలయ పరిసర ప్రాంతాలు సందడి నెలకొంది. ఆలయ అధికారులు, పోలీసులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. జాతరను పురస్కరించుకుని ఆలయం వద్ద భక్తులు మజ్జిగ, అంబళ్లు పంపిణీ చేశారు.

గంగమ్మ విశ్వరూప దర్శనంతో పులకించనున్న భక్తజనం

శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర మహోత్సవంలో చివరిరోజు బుధవారం తెల్లవారుజామున విశ్వరూపంతో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలోని అమ్మవారి విశ్వరూప కొడిస్తంభం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బంకమట్టితో సర్వాంగ సుందరంగా అమ్మవారి విశ్వరూప ప్రతిమ కొలువు తీరనుంది. అమ్మవారి విశ్వరూప ప్రతిమ చంపను పేరంటాల వేషధారుడు బుధవారం తెల్లవారుజామున నరకడంతో జాతర సమాప్తం అవుతుంది.



విశేష అలంకరణలో తాతయ్య గుంట గంగమ్మ

పంచలోహ విగ్రహం చోరీ



దొంగల వేలిముద్రలను పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

పాలసముద్రం : మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీ, కొత్తూరు గ్రామంలో వెలసిన గంగమ్మగుడిలో పంచలోహ విగ్రహం తోపాటు హుండీలో నగదు, మైక్‌సెట్ చోరీ చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. చిత్తూరు– బలిజకండ్రిగ జాయతీ రహదారి కొత్తూరు గ్రామ సమీపంలో గంగమ్మ గుడిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గర్భగుడి తలుపులు పగులగొట్టారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలైన్ కట్ చేసి డీవీఆర్‌తోపాటు పంచలోహ విగ్రహాన్ని చోరీ చేశారు. అలాగే హుండీలో సుమారు రూ.20 వేల వరకు నగదు, మైక్‌సెట్ తీసుకెళ్లారు. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిత్తూరు నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలో నిందితులను పట్టుకుంటామని ఆయన పేర్కొన్నారు.



చోరీకి గురైన పంచలోహ విగ్రహం

చక్రస్నానం.. భక్తజన పునీతం

- నేడు పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు సమాప్తం



పుష్కరిణిలో చక్రతాళ్వారుకు పూజలు చేస్తున్న భక్తులు

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం చక్రస్నానం వైభవోపేతంగా జరిగింది. వేకువజామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, అర్చన తదితర నిత్య కైంకర్యాల అనంతరం భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీకోనేటిరాయస్వామివారు తిరుచ్చిపై గ్రామ మాడ వీధుల్లో ఊరేగుతూ పుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. అక్కడ కంకణబట్టార్ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఉభయదారులకు, చక్ర తాళ్వారుకు స్నపన తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు చక్ర తాళ్వారుకు పుష్కరిణిలో అవబృథస్నానం చేయించారు. అదే సమయంలో అశేష భక్తులు గోవింద నామస్మరణలతో పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమంతో తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు ముగిశాయి. నేడు బుధవారం సాయంత్రం శ్రీవారి పుష్పయాగం ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. డిప్యూటీ స్పెషల్ గ్రేడ్ ఈఓ వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంచ్ పడితే పతకమే

ఒలింపిక్‌లో స్వర్ణమే లక్ష్యం

- ఇప్పటికే జర్మన్ మథాయ్ కిక్ బాక్సింగ్‌లో గెలుపు
- జాతీయ స్థాయిలో రెండు పతకాలు
- ఒలింపిక్ వైపు దూసుకెళ్తున్న అన్వేష్



జర్మనీ ఫిబో చాంపియన్ ‌షిప్పులో బహుమతి సాధించిన అన్వేష్

కుప్పంరూరల్: అసలే పేద కుటుంబం. రెక్కాడితేగానీ డొక్కాడని వైనం. తల్లి బెంగళూరులో కూరగాయల వ్యాపారం. తండ్రి చిరు వ్యాపారి. కానీ ఎక్కడ కుంగిపోలేదు. కిక్ బాక్సింగ్‌లో ఒలింపిక్ విజేత విజేందర్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని ఇప్పటికే రెండు జాతీయ, మరో మూడు క్లబ్‌స్థాయి పతకాలు సాధించాడు. తాజాగా జర్మనీలో జరిగిన ఫిబో మథాయ్ పోటీల్లో సిల్వర్ పథకం సాధించాడు. ఒలింపిక్ పతకమే లక్ష్యంగా దూసుకెళ్తున్నాడు కుప్పం మండలం, పైపాళ్యం గ్రామానికి చెందిన యువకుడు అన్వేష్.

ఇంతింతై..!

అన్వేష్ తల్లి దవళేశ్వరి బెంగళూరులో కూరగాయల వ్యాపారం, తండ్రి ప్రభాకర్ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సహాయకారిగా జీవనం సాగిస్తున్నారు. అన్వేష్‌కు మొదటి నుంచి కిక్ బాక్సింగ్ అంటే ఇష్టం. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే కిక్ బ్యాక్సింగ్‌పై మక్కువ పెంచుకున్నాడు. అతని ఆశయం, ఆలోచన గుర్తించిన తండ్రి ప్రభాకర్ ఆ దిశగా ప్రోత్సాహం అందించాడు. ప్రస్తుతం కుప్పం వికాస్ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న అన్వేష్‌కు వారాంతం శని, ఆదివారాల్లో బెంగళూరులోని ఏకేఎఫ్‌సీ అకాడమీలో కోచ్ కుమార్ వద్ద శిక్షణ ఇప్పిస్తున్నాడు. గత మూడేళ్లలో రాటుదేలాడు. 2023లో కనకపురలో నేషనల్ చాంపియన్ ‌షిప్, 2024లో మైపూరులో జరిగిన నేషనల్ చాంపియన్ ‌షిప్‌లో అన్వేష్ సిల్వర్ మెడల్ సాధించాడు. క్లబ్ స్థాయిలో జరిగిన పోటీల్లో ఇప్పటికే ఒక గోల్డ్, 2 సిల్వర్ మెడళ్లు సాధించాడు.

ఫిబో మెడల్‌తో గుర్తింపు...

2024 ఆగస్టులో జర్మనీలో జరిగిన మథాయ్ కిక్ బాక్సింగ్ పోటీల్లో అన్వేష్ సిల్వర్ మెడల్ సాధించాడు. దీంతో ఒక్కసారిగా కిక్ బాక్సింగ్ అభిమానుల కళ్లన్నీ అన్వేష్‌పై పడ్డాయి. ప్రభుత్వం సాయం అందిస్తే మరిన్ని పతకాలు సాధిస్తానని చెబుతున్నాడు. కనీసం స్పోర్ట్స్ స్కాలర్‌షిప్‌లైనా అందించాలని కోరుతున్నారు.



కళాశాలలో అన్వేష్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

విజేందర్‌సింగ్ నాకు ఆదర్శం



2008 బీజింగ్ ఒలింపిక్‌లో కిక్ బాక్సింగ్‌లో పతకం సాధించిన విజేందర్ సింగ్ బెనివాల్ నాకు ఆదర్శం. ఆయన తరహాలో కిక్ బాక్సింగ్‌లో రాణిస్తా. దేశానికి, తల్లిదండ్రులకు పేరు తేవాలని ఉంది. ఇప్పటికే బెంగళూరులోని అన్ని క్లబ్బు స్థాయిల్లో రాణించా. జాతీయ స్థాయిలో మూడు పథకాలు సాధించా. ఒలింప్‌లో పథకం సాధించడమే లక్ష్యం.

– అన్వేష్, యువ బాక్సింగ్ క్రీడాకారుడు, పైపాళ్యం

ఈతకు వెళ్లి బాలుడి మృతి



ప్రమాదానికి కారణమైన కుశస్థలి నది

శ్రీరంగరాజపురం : ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని పి.వి.పురం గ్రామంలో చోటుచేసుంది. స్థానికుల కథనం.. పి.వి.పురం గ్రామానికి చెందిన ఎస్.సురేష్, నందిని దంపతుల రెండవ కుమారుడు ఎస్.కార్తీక్ (8) మంగళవారం మధ్యాహ్నం స్నేహితులతో కలసి గ్రామ సమీపంలో ఉన్న కుశస్థలి నదిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈత నేర్చుకుంటూ అకస్మాత్‌గా నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు గ్రామస్తులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని కార్తీక్‌ను బయటకు తీశారు. అప్పటికే కార్తీక్ మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక పోలీసులు తెలిపారు. ఇదిలావుండగా కార్తీక్ తల్లి నందిని ఇటీవలే మృతి చెందారు. బంధువుల ఆర్తనాదాలు చూపరులను కంటతడి పెట్టించాయి.



మృతిచెందిన కార్తీక్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కార్వేటినగరం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొల్లాగుంట ఏఎడబ్ల్యూ సమీపం చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. మండలంలోని కొటార్వేడు గ్రామానికి చెందిన చిన్నబ్బ కుమారు ఎ.గిరిబాబు(29), తమిళనాడులోని తిరుత్తణికి చెందిన దివ్య(మౌనిక)తో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. అనారోగ్యం కారణంగా ఆమె పుట్టింటికి వెళ్లింది. మంగళవారం సాయంత్రం భార్యను చూసేందుకు గిరిబాబు తిరుత్తణికి ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. మార్గమధ్యంలో కొల్లాగుంట ఏఎడబ్ల్యూ సమీపం చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై పుత్తూరు నుంచి చిత్తూరుకు ఇనుప కమ్మీల(స్టీల్) లోడ్డుతో వెళ్తున్న లారీ గిరిబాబును వెనుక నుంచి ఢీకొట్టింది. ఆపై సుమారు పది అడుగుల వరకు లాక్కెళ్లింది. గిరిబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. భార్య మూడు నెలల గర్భిణిగా ఉన్నట్టు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.